క్లుప్తంగా

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



ఐరన్ మాత్రలు వేస్తున్న ఆరోగ్యకార్యకర్తలు

చిల్లకూరు: చిన్నారుల్లో వచ్చే రక్తహీనత ఐరన్ మాత్రలతో దూరం అవుతుందని చిల్లకూరు వైద్యు లు భావనారాయణ అన్నారు. చిల్లకూరులోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు మిగించడంతో రక్తహీనతను వందశాతం తగ్గించవ్చని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కూడా ఆయుష్మాన్ భారత్ పథకంలో రక్తహీనతను తగ్గించేలా ప్రతి నెలా నాలుగు గురువారాల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు.

వైభవంగా గ్రామోత్సవం



పోతురాజుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నాయుడుపేటటౌన్: అగ్రహారపేట అరుంధతీయవాడలోని మాతాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి కొలుపులో భాగంగా గురువారం పోతురాజు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని పుట్ట వద్ద పుట్ట బంగారం కథను ప్రారంభించి పూజలు చేశారు. ఆనంతరం పోతురాజు ఉత్సవమూర్తి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద అస్సల పర్వత యుద్ధం కథను చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పీ నాగార్జున, డీ రవి తదితరులు పాల్గొన్నారు.

నెలబల్లిలో ఆధార్ క్యాంప్



నెలబల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంపు

దొరవారిసత్రం: నెలబల్లి సచివాలయంలో గురువారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల్లోని పలువురు ఆధార్ కార్డులు అప్‌డేట్, సవరణలు చేసుకున్నారు. అలాగే మరికొంత మంది కొత్త ఆధార్ కార్డులు తీయించుకున్నారు. ప్రత్యేక ఆధార్ క్యాంపును 89 మంది వినియోగించుకున్నట్లు స్థానిక సచివాలయం సిబ్బంది తెలిపారు.

ఆర్బీకేలు అన్నదాతలకు వరం



సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ ప్రసాద్‌రావు

ఓజిలి: రైతుభరోసా కేంద్రాలు అన్నదాతలకు వరమని తిరుపతి వ్యవసాయశాఖ జేడీ ప్రసాద్ రావు అన్నారు. ఓజిలి ఆర్బీకేని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా సిబ్బంది రైతుల కు అందుబాటులో ఉండి వారి సమస్యలను గుర్తించి, స్థానికంగా పరిష్కరిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500 నగదు అందించి, వ్యవసాయం పండగ చేశాడని కొనియాడారు. రైతులకు సీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట గూడూరు ఏడీఏ గోపీనాయక్, ఏఓ విజయలక్ష్మి ఉన్నారు.

వేనాడు దర్గా హుండీ ఆదాయం రూ.21.4 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

తడ: మండలంలోని వేనాడులో ఉన్న షేక్ షా వ లీ అల్లాహ్ దర్గాకు హుండీల ద్వారా రూ.21,40,740 వచ్చిందని దర్గా నిర్వాహకులు తెలిపారు. గురువారం దర్గా హుండీల లెక్కింపు చేపట్టారు. ఎంపీడీఓ ఆమోసుబాబు ఆధ్వర్యంలో జరిగిన హుండీల లెక్కింపులో మండల కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, దర్గా ముష్తియార్ ముజావర్, గ్రామపెద్దల పాల్గొన్నారు. లెక్కింపు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తడ ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. హుండీ ద్వారా కానుకల రూపంలో సమకూరిన మొత్తాన్ని బ్యాంకులో జమ చేయనున్నారు.

నేడు సుమంగళి వ్రతం

నాయుడుపేటటౌన్: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం సామూహిక సుమంగళి వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రావణమాస శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆలయంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీదేవికి సహస్ర నామాలతో లక్ష కుంకుమార్చన, సుమంగళి వ్రత పూజలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అమాస వెంకట సుబ్బయ్య, రామా నారాయణ తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

జీజీఎంపీ..పల్లె ప్రగతికి వరం

నూతన సంస్కరణలకు చిరునామా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం ఇందులో ఒకటి. గతంలో ఎమ్మెల్యేలు గ్రామాల వైపు కన్నెత్తి చూసే వారు కాదు. అయితే అందుకు భిన్నంగా నేడు శాసనసభ్యులు నిత్యం ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. అందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో జీజీఎంపీ పల్లెల ప్రగతికి వరంగా మారింది.

- గ్రామాల్లో సమస్యల పరిష్కారం
- జోరుగా అభివృద్ధి పనులు



ఆబాక గ్రామంలో జీజీఎంపీ నిధులతో వేసిన సీసీ రోడ్డు

సూళ్లూరుపేట రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతున్నాయి. శరవేగంగా అభివృద్ధి సాగుతోంది. సూళ్లూరుపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులు చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖాధికారులకు ఈ పనులు అప్పగించడంతో ఇప్పటికే ఆ శాఖ అధికారులు పనులు సగభాగం పూర్తి చేశారు. మిగిలిన పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట మండలంలోని ఆబాక గ్రామంలో తొలివిడతగా సామంత మల్లాంరోడ్డు నుంచి మదరమిట్ట వరకు రూ.5 లక్షలు జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే బిట్–2 గా మరో రూ.5 లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ సచివాలయం పరిధిలో అబాక సచివాలయానికి మరో రూ. 10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతోపాటు కేసీఎన్‌గుం సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. ఇందులో రూ.3 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం వద్ద కల్వర్టు నిర్మించారు. కేసీఎన్‌గుంట బీసీ కాలనీలోని రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే బీసీ కాలనీలోని గంగమ్మ గుడి వద్ద రూ.4 లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. మిగిలిన రూ.10 లక్షలు కుదిరిలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించారు.



కేసీఎన్‌గుంట గ్రామం వద్ద నిర్మించిన కల్వర్టు

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: సంక్షేమ పథకాల అమలుతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. విద్య, వైద్యం, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానశాఖ, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చిన తర్వాత గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఉపాధి పనులను గ్రామాల్లో ముమ్మరం చేసి, పనులు కల్పించి ప్రజలు వలసలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీఓ రజనీకాంత్, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం చూపు భారత్ వైపు

చిల్లకూరు: చంద్రయాన్ విజయవంతంతో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని పారిచెర్లవారి పాళెం జెడ్పీ హైస్కూలు సైన్స్ టీచర్ వీవీ కుమార్ అన్నారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం చంద్రయాన్ విజయవంతంపై సంబరాలు చేసుకున్నారు. దేశంలో రాకెట్ ప్రయోగ కేంద్రం మన ప్రాంతంలో ఉండడం మనకు గర్వకారణం అన్నారు. ఇటీవలకాలంలో పలు దేశాలకు చెందిన రాకెట్లను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి ప్రయోగించేందుకు సిద్ధం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, శివరామిరెడ్డి, మాదవయ్య తదితరులు పాల్గొన్నారు.

తిమ్మనగారిపాళెంవాసుల ఆందోళన



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు: మండలంలోని తిమ్మనగారిపాళెంలో ఉన్న టైర్ల పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆ గ్రామస్తులు పరిశ్రమ ఎదుట గురువారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో నుంచి వచ్చే పొగ ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు శరీరంపై దద్దుర్లు వచ్చి తీవ్రంగా అనారోగ్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుసార్లు పరిశ్రమ యజమానులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికి తోడు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పరిశ్రమ ప్రతినిధులు అక్కడకు చేరుకుని యజమానులకు విషయం తెలియజేస్తామని చెప్పి, ఆందోళన విరమింపజేశారు.

నాణ్యతాప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: సీసీ రోడ్డు నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా దీర్ఘకాలం మన్నికగా ఉండేలా సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టాలన్నారు.

షటిల్ పోటీలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న విజయమోహన్‌రెడ్డి

గూడూరురూరల్: సెప్టెంబర్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గూడూరు నియోజకవర్గ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతం చేయాలని గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి అన్నారు. గూడూరులోని హెడీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో షటిల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11 ఏళ్లగా జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేశామన్నారు. గూడూరుకు చెందిన గౌస్ జాతీయ స్థాయి సీనియర్ ర్యాకింగ్స్‌లో 3వ స్థానంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. అలాగే ఎంతో మంది కోచ్‌లుగా స్థిరపడ్డారని తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారు సోమిశెట్టి చెంచురామయ్య, జమాలుల్లా, గిరి, కలామ్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం



రాపూరు: వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



కలువాయి: గోపూజ చేస్తున్న భక్తులు

రాపూరు: మండలంలోని తిక్కన పార్కు వద్ద ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ధ్వనిపూజ, అభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకురాలు గౌరిస్వామి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సైదాపురంలో..

సైదాపురం: ఓం నారాయణ..ఆదినారాయణ...అంటూ భక్తుల నామస్మరణలతో మండలంలోని ఊటుకూరులో ఉన్న వెంకయ్యస్వామి ఆలయం మార్మోగింది. ప్రతి ఏటా జరిగే ఈ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీభగవాన్ వెంకయ్యస్వామిని దర్శించుకుని, మొక్కులను తీర్చుకున్నారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

వైభవంగా ఆరాధన

కలువాయి: మండల కేంద్రంలోని భగవాన్ వెంకయ్యస్వామి, షిరిడీ సాయిబాబా మందిరంలో ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



సైదాపురం: వెంకయ్యస్వామి ఊరేగింపు

ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి, గోపూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం హరేరామ భజన, పండరి భజన కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు కొండ్రా కృష్ణారెడ్డి, మంజుల దంపతులు ఆరాధనా మహోత్సవాలకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కుల్లూరు వెంకయ్యస్వామి ఆరాధనా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ మాదాసు గంగాధరం పాల్గొన్నారు.

సార్..మాకు అన్ని పథకాలు వస్తున్నాయి!



వెంకటగిరిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: 'సార్..మాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వస్తున్నాయి. ప్రజల ముంగిటికే పరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.' అని షేక్ హాజీరబేగం ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని 21వ వార్డు పీర్జాతిపేటలో గురువారం ఉదయం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లు అందజేశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాడు పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్ట ణం కన్వీనర్ జి ఢిల్లీబాబు, విప్ పి లక్ష్మి, వైస్ ఎంపీ పీ సీహెచ్ ఉమామహేశ్వరి,నాయకులు దొంతు శారద, సీ హరికృష్ణ, గౌస్‌బాషా, తాజ్‌ఉద్దీన్, సతీష్, కేశవులు, పూర్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు మద్దతుగా నిలుద్దాం

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతుగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాలాయపల్లె మండలంలోని జయంపు, పిగిలాం, పిగిలాం ఎస్టీ కాలనీ, జార్లపాడు ,కొత్తపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.



యూనిఫామ్ పంపిణీ చేస్తున్న నేదురుమల్లి

యూనిఫామ్ పంపిణీ..

వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. జయంపు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒక్కొక్కరికి రెండు చీరలు, చిన్నారులకు పలకలు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందజేశారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీ కార్తిక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, జేసీఎస్ కన్వీనర్ బీ దేవి కాచౌదరి, సర్పంచ్‌లు సిద్ధయ్య, కే లక్ష్మి, ఎం వెంకటేశ్వర్లు, శ్రీహరి సుబ్బానాయుడు, జీ భాస్కర్‌రెడ్డి, ఎస్ సురేష్, జీ చెంచయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: పట్టణంలో త్వరలో ఫ్లైఓవర్ పనులు ప్రారంభం కానున్నాయని, ఈ నేపథ్యంలో రోడ్డుకిరువైపులా ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి ఐసీఎస్ రోడ్డులో పర్యటించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని, ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇంటి యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించారు. మార్కింగ్ తోపాటు నోటీసులు కూడా ఇచ్చామన్నారు. పట్టాలు ఉన్న వారికి ఇప్పటికే నగదు జమ చేశామన్నారు. కేవలం ఆరుగురికి మాత్రమే ఇవ్వాల్సి ఉందన్నారు. వారితో కూడా మాట్లాడతామని తెలిపారు. వంతెన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ లీలారాణి, డిస్కం ఈఈ ఇస్మాయిల్, సీఐలు, ఆర్ అండ్‌బీ అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గూడూరురూరల్: ఆర్టీసీ నుంచి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా మారిన తరువాత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి ప్రధానకార్యదర్శి పీ దామోదరరావు కోరారు. గూడూరులోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం తిరుపతి జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు గురునాథం అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.సుబ్రమణ్యం రాజు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆవుల ప్రభాకర్, గూడూరు డిపో గౌరవాధ్యక్షుడు బత్తిని విజయకుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మంగళం డిపోకు చెందిన ఏ.మురగమ్మ, కడప జోన్‌కు సంబంధించి జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అలిపిరి డిపోకు చెందిన వి.మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు ప్రకటించారు. గూడూరు డిపోకు చెందిన ఏడుగురు ఎస్ఎంయూ నాయకులు ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కడప జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, కార్యదర్శి ఎస్.రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఇ.రమేష్‌కుమార్, తిరుపతి జిల్లా కార్యదర్శి టీ సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె.జిలానీబాషా పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల పరిశీలన



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న పెద్దాస్వామి

రాపూరు: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులపై సెంట్రల్ అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడెక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా)కు చెందిన అధికారులు సేంద్రియ విధానంలో పండించిన ఉత్పత్తులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని ఆకలివలసలో పేర్నాటి సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో గురువారం అధికారులు సేంద్రియ ఉత్పత్తులను పరిశీలించి, వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపెడా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ డీ పెద్దాస్వామి మాట్లాడుతూ పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను విదేశీ మార్కెట్‌లో విక్రయించేందుకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగా పరిశీలించామన్నారు. ఆయన వెంట నెల్లూరు జిల్లా హార్టీకల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్నాటి సుష్మితారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ



గూడూరులో సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, టీచర్లు



చిట్టమూరులో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గూడూరురూరల్: పట్టణ సమీపంలోని గోగినేనిపురంలో ఆదిశంకర పాఠశాల విద్యార్థులు గురువారం పట్టణంలో చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే గులాబీ పుష్పాలను అందించి విజయానందాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ రూపవతి, శ్రీహరి, కృష్ణయ్య, హరిప్రియ, సావిత్రి, పీఈటీ మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జయహో ఇస్రో

వాకాడు(చిట్టమూరు): చంద్రయాన్–3 విజయవంతమై రోవర్ చంద్రునిపై అడుగు పెట్టిన సందర్భంగా గురువారం మండల కేంద్రమైన చిట్టమూరు జీఎంఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జయహో ఇస్రో అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ బీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ ఆధ్వర్యంలో జెండా చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ సాగించారు. తర్వాత పాఠశాల ఆవరణలో విద్యార్థులు జయహో ఇస్రో అనే అక్షరాల రూపంలో కూర్చొని ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు పద్మావతి, గిరిబాబు, సుభాషిణి, అపర్ణ, వెంకటేశ్వరరావు, చక్రవర్తి, శ్రీనివాసులు, దినకర్‌బాబు, భరత్ మహిపతి పాల్గొన్నారు.